క్లుప్తంగా

రాష్ట్ర టేబుల్ టెన్నిస్ విజేత ఆదినారాయణ



ఇబ్రహీంపట్నం: ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ స్పోర్ట్స్ కౌన్సిల్ ఏపీ సీపీడీసీఎల్ సంస్థల ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ చాంపియన్ షిప్ పోటీల్లో ఇబ్రహీంపట్నం ఎన్టీటీపీఎస్‌కు చెందిన డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.ఆదినారాయణ చాంపియన్‌గా నిలిచారు. ఈ నెల 8,9,10 తేదీల్లో గుంటూరులో జరిగిన ఓపెన్ సింగిల్స్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ట్రోఫీ కైవసం చేసుకున్నాడు, ఏపీ సీపీడీసీఎల్ డైరెక్టర్ జయ భారతరావు చేతుల మీదుగా ట్రోఫీ అందుకున్నాడు. ఈ సందర్భంగా ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ నవీన్‌గౌతమ్, వీటీపీఎష్ కో–ఆపరేటీవ్ స్టోర్స్ సభ్యుడు కొత్తపల్లి వెంకటరమణ, ఉద్యోగులు అభినందించారు.

14నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

జి.కొండూరు: స్థానిక గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి 20వ తేదీవరకు 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి వి.విజయకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వివిధ విభాగాల్లో పోటీలను నిర్వహించి బహుమతులను అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

తిరువూరులో..

తిరువూరు: స్థానిక గ్రేడ్–1 శాఖా గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి 20వరకు వారోత్సవాలు నిర్వహించనున్నట్లు లైబ్రేరియన్ పద్మావతి తెలిపారు. 14న విచిత్ర వేషధారణ పోటీలు, 15న పుస్తక ప్రదర్శన, విద్యార్థులకు వక్తృత్వ పోటీలు, 16న చిత్రలేఖనం, క్విజ్ పోటీలు, 17న కవి సమ్మేళనం, 18న కబడ్డీ పోటీలు, 19న మహిళా దినోత్సవం, 20న విద్యార్థులకు బహుమతి ప్రదానం జరుగుతుందని తెలిపారు.

దుప్పట్ల పంపిణీ

గంపలగూడెం: గంపలగూడెం వికాస తరంగిణి ఆధ్వర్యంలో త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్‌స్వామి తిరునక్షత్రం (పుట్టినరోజు) సందర్భంగా శనివారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. స్వర్గీయ కొల్లా నాగేశ్వరరావు జ్ఞాపకార్థం కుటుంబ సభ్యుల సౌజన్యంతో 40 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు.

చేతి వృత్తులపై అవగాహన

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కనుమరుగవుతున్న చేతివృత్తులను కాపాడు కోవడం మనందరి కర్తవ్యమని క్రాంతి హైస్కూల్ కరస్పాండెంట్ వెనిగళ్ల మురళీమోహన్ అన్నారు. పాఠశాలలో దీపావళి సందర్భంగా ప్రమిదల తయారీపై విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు.

జెడ్పీ పాఠశాల స్టోర్ రూమ్‌లో అగ్నిప్రమాదం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల స్టోర్ రూమ్‌లో అగ్నిప్రమాదం సంభవించింది. పాఠశాలలో విరిగిన కుర్చీలు, టేబుల్స్, పాత డబ్బాలు, తదితర పనికిరాని వస్తువులు ఆ గదిలో ఉంచారు. శనివారం సెలవు కావడంతో ఆకతాయిల చేష్టలకు మంటలు చెలరేగినట్లు గుర్తించారు. పాఠశాలకు చేరిన అగ్నిమాపకదళ వాహన సిబ్బంది మంటలను అదుపుచేశారు.

ప్రత్యేక బస్సులు

తిరువూరు: కార్తీక మాసంలో పలు పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు తిరువూరు ఆర్టీసీ డిపో మేనేజరు వేణు తెలిపారు. ప్రతి శని, ఆదివారాల్లో అన్నవరం, శ్రీశైలం, పంచారామాలు, అరుణాచలం పుణ్యక్షేత్రాలకు ఈ ప్రత్యేక బస్సులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అన్ని సర్వీసులకు అడ్వాన్స్ రిజర్వేషన్ సదుపాయం ఉందని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

డాక్యుమెంట్స్ పోయినవి

లక్కోజి సుధాకర్ బాబు, తండ్రి: పరమేశ్వర రావు, డోరు నెం. 1-142, గుంటుపల్లి గ్రామం, ఇబ్రహీంపట్నం మండలం, ఎన్.టి.ఆర్. జిల్లా అను నాకు సంబంధించిన ఒరిజినల్ సేల్ డీడ్స్ అండ్ లింక్ డాక్యుమెంట్స్ (సేల్ డీడ్ నెం. 2553/2011) గుంటుపల్లి నుండి ఇబ్రహీంపట్నం బైక్‌పై వెళ్తుచుండగా పోయినవి. ఎవరికైనా దొరికినచో పై అడ్రస్సుకు గానీ, ఈ క్రింద ఇవ్వబడిన ఫోన్ నెంబరుకు గానీ తెలుపగలరు. ✆ 77025 39652.



సీఎం పర్యటనను విజయవంతం చేయాలి

సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

నూజివీడు: అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఈ నెల 17వ తేదీన నూజివీడులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ సూచించారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో శనివారం పోలీస్, మున్సిపల్, విద్యుత్, రెవెన్యూ, పంచాయతీరాజ్, మండల పరిషత్ తదితర శాఖల అధికారులతో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ హెలీప్యాడ్ వద్ద నుంచి విస్సన్నపేట రోడ్డులోని సభా ప్రాంతం వరకు కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేయాలని డీఎస్పీ ఈడే అశోక్‌కుమార్‌కు సూచించారు. హెలీప్యాడ్ వద్ద ఉన్న విద్యుత్ తీగలను అక్కడి నుంచి పక్కకు మార్చాలన్నారు. అలాగే పట్టణంలో ప్రధాన రోడ్డు వెంబడి పారిశుద్ధ్యం మెరుగ్గా ఉండాలన్నారు. సీఎం సభకు జన సమీకరణకు సంబంధించి ఆర్టీసీ బస్సులను ముందురోజే ఆయా గ్రామాలకు పంపించాలని, స్వయం సహాయక సంఘాల మహిళలు, ప్రజలు బస్సుల్లో ఎక్కేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. సీఎం సభ జరిగే సభా ప్రాంగణంలో వచ్చే జనానికి తాగునీటి ఇబ్బందులు లేకుండా మంచినీటి ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. బస్సులను కేటాయించిన పార్కింగ్ ప్రాంతాల్లోనే సభ ముగిసే వరకు ఉంచి తిరిగి ఎక్కించుకొచ్చిన జనాన్ని తీసుకెళ్లి వారి ఊరిలో దించేలా చూసుకోవాలన్నారు. ప్రతి బస్సుకు ఒక ఇన్‌చార్జిని నియమించాలన్నారు. సీఎం పర్యటనలో విద్యుత్ సరఫరాలో అంతరాయం జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాటు చేసుకోవాలని ఏపీసీపీడీసీఎల్ అధికారులకు సూచించారు. అన్ని శాఖల అధికారులు పటిష్టమైన ప్రణాళికతో సమర్థవంతంగా విధులు నిర్వహించి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్, ఏపీసీపీడీసీఎల్ ఈఈ సత్యనారాయణ, డీఈలు పోతురాజు, ఓలేటి దుర్గారావు, డీఎల్‌డీఓ వెంకటరత్నం, పట్టణ సీఐ ఎంవీవీఎస్ఎన్‌మూర్తి, ట్రాఫిక్ ఎస్సై రాధాకృష్ణారెడ్డి, మున్సిపల్ డీఈ లక్ష్మీనారాయణ, ఆర్అండ్‌బీ ఏఈ అశోక్‌కుమార్, తహసీల్దార్ డీవీఎస్ యల్లారావు, నూజివీడు, ముసునూరు, ఆగిరిపల్లి ఎంపీడీఓలు విజయ్‌కుమార్, రాణి, పీ శంకరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు రాము పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

భద్రతా పర్యవేక్షణ ఉండాలి

డీసీపీ అజితా వేజెండ్ల

జి.కొండూరు: దీపావళి టపాసుల దుకాణాల వద్ద అధికారుల నిరంతర పర్యవేక్షణ ఉండాలని విజయవాడ డీసీపీ అజితా వేజెండ్ల అన్నారు. జి.కొండూరులో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాలను ఆమె శనివారం రాత్రి పరిశీలించారు. దుకాణాల వద్ద భద్రతా ప్రమాణాలను పరిశీలించిన ఆమె వృద్ధులు, చిన్నారుల దుకాణాల వద్దకు రాకుండా చూడాలని దుకాణాల యజమానులకు సూచించారు. అగ్నిమాపక, విద్యుత్ శాఖ, రెవెన్యూ, పోలీసుశాఖ అధికారులు నిరంతరం దుకాణాలను పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మైలవరం ఏసీపీ ఎం రమేష్, సీఐ మోహన్ రెడ్డి జి.కొండూరు, రెడ్డిగూడెం ఎస్ఐ ధర్మరాజు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాణసంచా కాల్చేటప్పుడు జాగ్రత్తలు పాటించండి

ఆగిరిపల్లి: దీపావళి పండుగ సందర్భంగా ప్రజలు భద్రత ప్రమాణాలను దృష్టిలో ఉంచుకొని పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఎస్సై నంబూరు చంటిబాబు సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా, అక్రమంగా టపాసులు నిల్వ ఉంచినా, విక్రయించినా చర్యలు తప్పవన్నారు.

ట్రిపుల్ ఐటీని సందర్శించిన సీనియర్ సివిల్ జడ్జి

నూజివీడు: పట్టణంలోని ట్రిపుల్ ఐటీని శనివారం స్థానిక సీనియర్ సివిల్ జడ్జి షేక్ పెదఖాసిం సందర్శించి మెస్‌లను, విద్యార్థుల హాస్టళ్లను పరిశీలించారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ట్రిపుల్ ఐటీని సందర్శించారు. ఇందులో భాగంగా మెస్‌లలో విద్యార్థులకు తయారు చేసిన ఆహార పదార్థాలను పరిశీలించి విద్యార్థుల నుంచి వివరాలను సేకరించారు. అలాగే విద్యార్థుల హాస్టళ్లను పరిశీలించారు. జడ్జి వెంట న్యాయవాది పద్మాంజలి ఉన్నారు.



మెస్‌లో తయారు చేసిన ఆహారాన్ని పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి షేక్ పెదఖాసిం

23 వరకు సేవా కార్యక్రమాలు

తిరువూరు: భగవాన్ శ్రీసత్యసాయిబాబా జన్మదిన వేడుకలు శనివారం తిరువూరు సత్యసాయి సేవా మందిరంలో ప్రారంభమయ్యాయి. ఈ నెల 23వ తేదీ వరకు ప్రతిరోజూ సేవా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతాయని మందిర కన్వీనర్ ప్రభాకరరావు తెలిపారు. తొలిరోజు సుప్రభాత సేవ, సంకీర్తన అనంతరం అఖండభజన ప్రారంభించారు.

ప్రణాళికాబద్ధంగా చదివితే లక్ష్యం సాధించవచ్చు

ఇస్రో శాస్త్రవేత్త జాన్‌కుమార్

విస్సన్నపేట: విద్యార్థులు క్రమశిక్షణతో ప్రణాళికాబద్ధంగా చదివితే లక్ష్యం సాధించవచ్చని ఇస్రో శాస్త్రవేత్త డాక్టర్ జాన్‌కుమార్ అన్నారు. స్థానిక వికాస్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. మండలంలోని కొండపర్వ గ్రామానికి చెందిన జాన్‌కుమార్ స్థానిక వికాస్ కళాశాల పూర్వ విద్యార్థి కావడంతో వికాస్ కళాశాలలో విద్యార్థులకు అవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు. ప్రపంచాన్ని మార్చడానికి మీరు ఉపయోగించే అత్యంత శక్తివంతమైన ఆయుధం విద్య అన్నారు. జ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. మైండ్‌ను సరైన మార్గంలో వినియోగిస్తూ ధైర్యంగా ముందుకు నడవాలన్నారు. తమ కళాశాల పూర్వ విద్యార్థి ఇస్రో శాస్త్రవేత్త కావడం గొప్పవిషయమని వికాస్ విద్యాసంస్థల చైర్మన్ ఎస్ నర్సిరెడ్డి అన్నారు. అనంతరం కళాశాల తరుపున జాన్‌కుమార్‌ను సన్మానించారు.



ఇస్రో శాస్త్రవేత్త జాన్‌కుమార్‌ను సన్మానిస్తున్న వికాస్ విద్యాసంస్థల చైర్మన్ నర్సిరెడ్డి

ఇచ్చిన హామీలకు మించి సంక్షేమ పథకాల అమలు

విస్సన్నపేట: ఇచ్చిన హామీలకు మించి ఎన్నో సంక్షేమ పథకాలను పార్టీలకతీతంగా అమలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి అన్నారు. ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా విస్సన్నపేట సచివాలయం–1 పరిధిలో గతరాత్రి పల్లె నిద్ర నిర్వహించి శనివారం ఉదయం ఇంటింటికీ వెళ్లి గత ప్రభుత్వంలో ఇచ్చిన హామీలు, వైఎస్సార్ సీపీ ఇచ్చిన హామీలలో ఏ ముఖ్యమంత్రి మంచి చేశారని ప్రజాభిప్రాయ సేకరణ చేసారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి, సచివాలయ కన్వీనర్ల మండల కన్వీనర్ శివబాజీ, వైస్ ఎంపీపీ రెడ్డి వెంకట శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ప్రజాభిప్రాయ సేకరణలో లోకేశ్వరరెడ్డి, జేసీఎస్ కన్వీర్ శివబాజీ

ప్రతి ఒక్కరూ విద్యావ్యాప్తికి కృషి చేయాలి

మైలవరం: ప్రతి ఒక్కరూ విద్యా వ్యాప్తికి కృషి చేసి, ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు తెలిపారు. మైలవరం లకిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం జరిగిన సమావేశంలో ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు మాట్లాడుతూ భారత రత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకుంటారని తెలిపారు. ముందుగా అబుల్ కలాం ఆజాద్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ బి. శివహరి ప్రసాద్, డీన్ అకాడమిక్స్ డాక్టర్ యమ్. శ్రీనివాసరావు, ఎస్. ఉమామహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): వివాహిత అదృశ్యంపై ఎస్ఎన్ పురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పగిడాకుల ఆదిమ్మ కంచికచర్ల మండలం, గొట్టిముక్కల గ్రామంలో కూతురు సుంకర కృష్ణవేణి, అల్లుడు రాజేష్‌తో కలిసి నివాసముంటున్నారు. విజయవాడలో జరుగుతున్న సినిమా షూటింగ్‌లో రోజువారి కూలిగా పని చేసేందుకు ఈ నెల 10న కూతురు, అల్లుడుతో కలిసి ఆమె నగరంలోని గాంధీనగర్‌కు వచ్చి షూటింగ్‌లో పాల్గొన్నారు. సాయంత్రం 6 గంటల సమయంలో ఇంటికి వెళ్లేందుకు కూతురు సుంకర కృష్ణవేణిని పిలువగా, షూటింగ్‌లో పాల్గొనేందుకు విజయవాడ రూరల్‌లోని పాతపాడు నుంచి వచ్చిన తన అత్త ఇంద్రావతితో కలిసి వెళ్తానని చెప్పడంతో ఆమె తల్లి వెళ్లిపోయింది. అత్తతో కలిసి ఆటోలో వెళ్తున్న కృష్ణవేణి ముత్యాలంపాడులోని శివాలయం వద్ద ఆటో దిగి మరో ఆటో ఎక్కి వెళ్లిపోయింది. దీంతో జరిగిన విషయాన్ని ఆమె తల్లికి తెలిపింది. కృష్ణవేణి బంధువులు, తెలిసిన వారి వద్ద వాకాబు చేసినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో శనివారం సాయంత్రం ఎస్ఎన్‌పురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

గ్రంథాలయ భవనానికి రంగులు

పెనుగొలను(గంపలగూడెం): గంపలగూడెం మండలం పెనుగొలను శాఖ గ్రంథాలయ భవనానికి దాత సహకారంతో రంగులు వేయించారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా స్థానికి షిరిడీ సాయిబాబా సేవా కమిటీ సౌజన్యంతో రంగులు వేయించారు. సేవా కమిటీకి గ్రంథాలయ నిర్వాహకురాలు జే. శ్రీలత కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం



నూజివీడు: పట్టణంలోని 15వ సచివాలయ పరిధిలో శుక్రవారం రాత్రి వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా 29, 30 వార్డుల్లో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, కౌన్సిలర్లు నడకుదురు గిరీష్, జూట్రు మేరీరాణి, సచివాలయాల కన్వీనర్ పిళ్లా చరణ్, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావుతో పాటు పలువురు నాయకులు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. అలాగే సహపంక్తి భోజనాలు చేసి, వార్డులోనే నిద్ర చేశారు. కార్యక్రమంలో కోటగిరి సతీష్, షేక్ మస్తాన్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

మహిళలు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

చంద్రాల(మైలవరం): మహిళలు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ ప్రియాంక తెలిపారు. ముఖ్యంగా పిల్ల తల్లులు, గర్భిణులు నిమోనియా రాకుండా తగు జాగ్రతలు తీసుకోవాలన్నారు. మైలవరం మండలం చంద్రాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పిల్లల తల్లులు, గర్భిణులకు నిమోనియా వ్యాధిపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పిల్లల తల్లులు, గర్భిణులు తమ ఆహారపు అలవాట్లు మార్చుకోవాలన్నారు. తల్లులకు సంక్రమించే నిమోనియా తదితర వ్యాధులు పిల్లలకు వస్తుందన్నారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి ఆరోగ్య డేటాను సేకరించేపుడు పిల్లతల్లులను, గర్భిణులను పరిశీలించి వారి ఆరోగ్యం ఎలా ఉందనేని చూడాలన్నారు. జలుబు, దగ్గు వంటి రోగాలు బారిన పడిన వారికి తగు సూచనలు ఇవ్వాలన్నారు. వారిని వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలని చెప్పాలన్నారు. నిమోనియ ప్రాథమిక దశలో ఉంటే సిరప్ వాడటం వలన నివారించవచ్చన్నారు.

ముగిసిన శిక్షణ

ఆగిరిపల్లి: శిక్షణాంశాలను క్షేత్ర స్థాయిలో అమలు చేయడం ద్వారా శిక్షణ తరగతుల లక్ష్యాలను సాధించవచ్చని శిక్షణాధికారి సురేష్ కుమార్ అన్నారు. మండలంలోని తోటపల్లిలో ఉన్న హీల్ ప్యారడైజ్ స్కూల్‌లో ఉపాధ్యాయులకు, అంగన్‌వాడీ సిబ్బందికి నిర్వహిస్తున్న ఆరు రోజుల శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. హీల్ సంస్థ చేస్తున్న వివిధ సేవాకార్యక్రమాలకు శిక్షణార్థుల తరపున రూ.74,300 విరాళాన్ని హీల్ సంస్థ కార్యదర్శి తాతినేని లక్ష్మికి అందజేశారు. కార్యక్రమంలో ప్రథమ్ సంస్థ నుంచి శివ, కీ రీసోర్స్ పర్సన్స్ కుసుమ, పూర్ణ చంద్రముఖి పాల్గొన్నారు.

ఆస్తి తగాదాలో తమ్ముడిపై అన్న దాడి

ఆగిరిపల్లి: ఆస్తి తగాదా విషయమై తమ్ముడిపై సొంత అన్న దాడి చేసిన ఘటన మండలంలోని సింహాద్రి అప్పారావుపేటలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పిన్నిబోయిన వీరరాఘవు మంగళవారం ఉదయం తన తండ్రి ఇంటి వద్దకు వెళ్లి తనకు వాటా ఉన్నప్పటికీ అన్న అంకాలు ఆస్తిని తన భార్య పేరుపై మార్చేందుకు సచివాలయానికి వచ్చాడని, ఇదెక్కడి న్యాయమని తండ్రిని అడిగాడు. ఇదే సమయంలో అంకాలు ఇంట్లో నుంచి బయటకు వచ్చి తనను తిట్టి కర్రతో దాడి చేసి కొట్టడంతో వీరరాఘవులు కుడికన్నుపై గాయమైంది. అతని అన్న కుమారుడు సైతం వచ్చి కర్రతో దాడి చేసి కొట్టడంతో తలకు గాయమైంది. వెంటనే చుట్టుపక్కల వారు వచ్చి విడదీసి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నంబూరు చంటిబాబు తెలిపారు.

ఘనంగా అయ్యప్ప పడి పూజ

చాట్రాయి: మండలంలోని చిన్నంపేటలో శుక్రవారం రాత్రి అయ్యప్ప పడిపూజ ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప దీక్ష తీసుకున్న వందలాది మంది అయ్యప్ప స్వాములు పాల్గొని స్వామియే శరణం అయ్యప్పా అంటూ పాటలు పాడుతూ 16 మెట్లకు పూజలు చేశారు. అనంతరం అల్పాహారం పంపిణీ చేశారు. పీఏసీఎస్ చైర్మన్ పరసా చెన్నారావు దీక్ష చేపట్టిన సందర్భంగా అయ్యప్ప పడి పూజ నిర్వహించారు. నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు తనయుడు మేకా వెంకట నాగ వేణుగోపాల అప్పారావు(చంటినాయన), ఏపీ కో–ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, మండల వైఎస్సార్ సీపీ నాయకులు బాబ్జీ, వాసు, బాలకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం

చాట్రాయి: మండలంలోని సూరంపాలెం ప్రాథమిక పాఠశాలలో శనివారం జాతీయ విద్యా దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. దేశ ప్రథమ విద్యాశాఖా మంత్రి మౌలానా అబుల్ కలామ్ జయంతి సందర్భంగా జాతీయ విద్యా దినోత్సవాన్ని జరుపుకున్నారు. అనంతరం కలామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పాఠశాల హెచ్‌ం ముత్తయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు మెరుగ్గా ఉండాలి

నూజివీడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నూజివీడు పర్యటన నేపథ్యంలో పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగ్గా ఉండాలని జిల్లా గ్రామ పంచాయతీ అధికారి శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో విస్తరణ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో శనివారం డివిజనల్ స్థాయి సమీక్ష సమావేశం డీపీఓ శ్రీనివాస విశ్వనాథ్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ నెల 17 సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు నూజివీడు రానున్న నేపథ్యంలో పారిశుద్ధ్య నిర్వహణపై పంచాయతీ కార్యదరులు, విస్తరణ అధికారులతో ముందస్తు సమీక్ష సమావేశం నిర్వహించారు. హెలిప్యాడ్, ఎంజీ లేఔట్, వాహనాల పార్కింగ్ ప్రాంతాలలో ముఖ్యంగా హెలిప్యాడ్ నుంచి బహిరంగ సభ ప్రాంగణం రోడ్డు మార్గంలో ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణ కార్యక్రమాలు జరగాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించడానికి 450 మంది కార్మికుల సేవలను, 200 మంది పంచాయతీ కార్యదర్శులను వినియోగించనున్నామన్నారు. మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్, డివిజనల్ పంచాయతీ అధికారి సుందరి పాల్గొన్నారు.

దూరప్రాంత సర్వీసులు నడపాలి

తిరువూరు: ప్రయాణికుల అవసరాల కనుగుణంగా తిరువూరు డిపో నుంచి దూరప్రాంత బస్సుసర్వీసులు నడపాలని పలువురు కోరారు. డయల్ యువర్ డీఎం కార్యక్రమం తిరువూరు డిపోలో శనివారం నిర్వహించారు. గంపలగూడెం నుంచి భద్రాచలం, హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ సర్వీసులు, గానుగపాడు–కొత్తూరు మీదుగా విజయవాడ బస్సులు, తిరువూరు నుంచి హైదరాబాదుకు పగటివేళ సర్వీసులు ప్రారంభించాలని ప్రయాణికులు కోరారు. సాయంత్రం నాలుగు గంటలకు మచిలీపట్నంకు బస్సుసర్వీసు నడపాలని, పామూరుకు రెండో సర్వీసు, తిరువూరు నుంచి మెహిదీపట్నం, గచ్చిబౌలీ, బీరంగూడా మీదుగా బీహెచ్‌ఈఎల్‌కు బస్సులు నిర్వహించాలని సూచించారు. ఉన్నతాధికారులకు తెలియజేసి బస్సుసర్వీసుల నిర్వహణకు చర్యలు చేపడతామని డిపో మేనేజరు వేణు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో సత్యసాయి అఖండ భజన

గంపలగూడెం: పుట్టపర్తి సత్యసాయిబాబా పుట్టిన రోజు సందర్భంగా గంపలగూడెంలో సత్యసాయిబాబా భజన మండలి ఆధ్వర్యంలో శనివారం అఖండ భజన చేపట్టారు. భజన మండలి కన్వీనర్ చారగుండ్ల కృష్ణారావు ఇంటి వద్ద భక్తులు సత్యసాయిబాబా కీర్తనలను ఆలపించారు.

ఘనంగా ఉరుసు మహోత్సవం

విస్సన్నపేట: గ్యార్మీ షరీఫ్ పండగ సందర్భంగా మహబుసుభాని ఉరుసు మహోత్సవం శుక్రవారం రాత్రి స్థానిక కొత్తపేటలో దర్గావద్ద ఘనంగా నిర్వహించారు. అనంతరం గంధ మహోత్సవం నిర్వహించారు. ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

దుస్తులు అందజేత

కె.తాడేపల్లి(విజయవాడరూరల్): సత్యసాయి సేవా సమతి ఆధ్వర్యంలో శనివారం కొత్తూరు గ్రామంలో గ్రామ సేవలు కార్యక్రమంలో భాగంగా గ్రామ సంకీర్తన జరిగింది. ఈ సందర్భంగా 370 మందికి స్వామి ఫొటో, పులిహోర ప్రసాదం పంపిణీ చేశారు. అనంతరం వృద్ధులకు, దివ్యాంగులకు 62 మందికి దుస్తులు అందజేశారు.

నిబంధనలు పాటించాలి

విస్సన్నపేట: దీపావళి సందర్భంగా ఏర్పాటు చేసిన బాణాసంచా విక్రయ దుకాణ దారులు తగిన ఫైర్‌సేఫ్టీ నిబంధనలు పాటించాలని అగ్నిమాపక అధికారి భరత్ భూషణ్ అన్నారు. స్థానికంగా ఏర్పాటు చేసిన బాణాసంచా విక్రయ దుకాణాలను శనివారం ఆయన పరిశీలించారు.